# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 255 మంగళవారం | 16 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




8లో

## సివిల్స్‌లో మనోళ్లు..

యూపీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటిన ఉమ్మడి వరంగల్ జిల్లా యువకులు



పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
జర్నలిస్టు మిత్రులకు,
అధికారులకు,
ప్రజా ప్రతినిధులకు,
నాయకులకు, వ్యాపార వాణిజ్యవేత్తలకు,

**శ్రీరామ నవమి పర్వదిన శుభాకాంక్షలు**

పండుగ సందర్భంగా బుధవారం కార్యాలయానికి సెలవు..
పున: దర్శనం గురువారం



# భద్రాద్రి రామయ్యకు.. ఎన్నికల కోడ్




**ప్రత్యక్ష ప్రసారానికి బ్రేక్**

**ప్రభుత్వ రిక్వెస్ట్‌ను తోసిపుచ్చిన ఈసీ**

**కోట్లాది భక్తులకు తప్పని నిరాశ**

**40 ఏళ్లుగా ప్రతీ ఏటా లైవ్ టెలికాస్ట్**

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో ప్రతీ ఏటా శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తమ ఆరాధ్య దైవం రామయ్య కల్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా దేశం నలుమూలలనుంచి లక్షలాది మంది భక్తులు భద్రాద్రికి తరలివస్తుంటారు. ప్రత్యక్షంగా కల్యాణాన్ని చూసేందుకు వీలుకాని భక్తులు.. లైవ్ టెలికాస్ట్ ద్వారా టీవీల్లో వీక్షించి తరిస్తుంటారు. దేశ, విదేశాల్లోని కోట్లాది మంది భక్తులు టీవీల్లో శ్రీసీతారాముల కల్యాణాన్ని చూస్తూ పరవశించిపోతుంటారు.

అయితే ఈ నెల 17న శ్రీ రామ నవమి సందర్భంగా నిర్వహించనున్న భద్రాద్రి రాముడి కల్యాణాన్ని టీవీల్లో చూసే అదృష్టం లేకుండా పోయింది. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉందన్న కారణంతో ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది.

ఈ నేపథ్యంలో గత 40 ఏళ్లుగా ప్రతీ ఏటా లైవ్ టెలికాస్ట్ అవుతున్న భద్రాద్రి రామయ్య కల్యాణానికి మినహాయింపు ఇవ్వాలంటూ ప్రభుత్వం చేసిన రిక్వెస్ట్‌ను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. దీంతో కోట్లాది రామ భక్తులకు నిరాశ తప్పడం లేదు. - వరంగల్ వాయిస్, భద్రాద్రి



8లో..

## బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

పేదలకు అండగా కాంగ్రెస్

వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య




8లో..

## స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, ఎన్ హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్



8లో

పోలీస్ శాఖలో..

## ప్రైవేట్ డ్రైవర్ల అత్యుత్సాహం

అంతా మేమే అంటూ బిల్డప్

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

# భద్రాద్రి రామయ్యకు.. ఎన్నికల కోడ్



**ప్రత్యక్ష ప్రసారానికి బ్రేక్**
**ప్రభుత్వ రిక్వెస్ట్‌ను తోసిపుచ్చిన ఈసీ**
**కోట్లాది భక్తులకు తప్పని నిరాశ**
**40 ఏళ్లుగా ప్రతీ ఏటా లైవ్ టెలికాస్ట్**

**వరంగల్ వాయిస్, భద్రాద్రి :** ప్రతీఏటా భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు భద్రాద్రికి తరలివస్తుంటారు. ప్రత్యక్షంగా కల్యాణాన్ని చూసేందుకు వీలుకాని భక్తులు.. లైవ్ టెలికాస్ట్ ద్వారా టీవీల్లో వీక్షించి తరిస్తుంటారు. కోట్లాది మంది భక్తులు టీవీల్లో శ్రీసీతారాముల కల్యాణాన్ని చూస్తూ పరవశించిపోతుంటారు. అయితే ఈసారి మాత్రం భద్రాద్రి రాముడి కల్యాణాన్ని టీవీలో చూసే అదృష్టం లేకుండా పోయింది. అందుకు త్వరలో జరుగనున్న ఎన్నికలే కారణంగా మారాయి. అయితే ఎన్నికల కోడ్ పేరుతో ప్రత్యక్ష ప్రసారంపై ఆంక్షలు విధించడాన్ని భక్తులు తప్పుపడుతున్నారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీసేలా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని మండి పడుతున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్..

దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పార్లమెంట్ ఎన్నికలు భద్రాద్రి రామయ్య కల్యాణాని చెందిన ప్రత్యక్ష ప్రసారానికి అడ్డంకిగా మారాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగునున్నాయి. ఎన్నికల నేపథ్యంలో లైవ్ టెలికాస్ట్ లపై ఈసీ ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో భద్రాద్రి రాముడి కల్యాణానికి ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పడింది. రామయ్య కల్యాణం లైవ్ టెలికాస్ట్‌పై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది.

## ప్రభుత్వ రిక్వెస్ట్..

రాములోరి కల్యాణ లైవ్ టెలికాస్ట్‌కు అనుమతి ఇవ్వాలని దేవాదాయ శాఖ ఎన్నికల కమిషన్ ను కోరింది. ఈ మేరకు దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు. గత 40 ఏళ్లుగా ప్రతీ ఏటా లైవ్ టెలికాస్ట్ అవుతున్న నేపథ్యంలో ఈ ఏడు కూడా అనుమతించాలని ఈసీకి ప్రభుత్వం రిక్వెస్ట్ పెట్టింది. లైవ్ టెలికాస్ట్‌ను దేశ, విదేశాల్లోని కోట్లాది మంది భక్తులు చూసే అవకాశం ఉన్న నేపథ్యంలో మానవతా దృక్పదంతో ప్రత్యక్ష ప్రసారానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున లైవ్ టెలికాస్ట్‌కు అనుమతి ఇవ్వలేమని ఈసీ తేల్చిచెప్పేసింది.

## సీఎం పట్టు వస్త్రాలు సమర్పించేనా..?

ప్రతి ఏడు అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణానికి ప్రభుత్వం తరుపున సీఎం పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే పార్లమెంట్ ఎన్నికల ఎఫెక్ట్‌తో సీఎం భద్రాచలం వెళ్తారా?.. లేదా? అన్నదానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసారి సీఎస్ చేతుల విరీదుగా పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ముస్తాబైన మిథిలా స్టేడియం..

శ్రీరామనవమికి భద్రాచలం ముస్తాబైంది. సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధమైంది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా రామాలయం ఉత్తర ద్వారం వద్ద ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా మొదలైంది. బుధవారం జరుగనున్న సీతారాముల కల్యాణం కోసం మిథిలా స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయంతోపాటు పంచవటిలో ఉన్న సీతారాములు, లక్ష్మణ, రావణాసురుడి విగ్రహాలకు రంగులు వేశారు. విద్యుత్ వెలుగులతో రామాలయం మెరిసిపోతోంది. శ్రీరామ నవమి రోజు సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు చలువ పందిళ్లు వేశారు. స్వామివారి కల్యాణ వేడుకలు వీక్షించేందుకు మొత్తం 24 సెక్టార్లు ఏర్పాటు చేశారు. ప్రతి సెక్టార్‌లో ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు. బుధవారం సీతారాముల కల్యాణం, గురువారం శ్రీ రామ పట్టాభిషేకం నిర్వహించేందుకు అధికారులు, పూజారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.





# నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు

**18నుంచి 25 వరకు స్వీకరణ**
**వరంగల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ ఎస్సి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య వెల్లడించారు. ఈ నెల 18 నుంచి వరంగల్ కలెక్టరేట్ లో నామినేషన్లు స్వీకరించనున్న నేపథ్యంలో మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అబ్దుల్ బారి, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, డీఆర్ఓ శ్రీనివాస్ లతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలుచేశారు. బారికేడ్ల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, మీడియా పాయింట్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నామినేషన్ స్వీకరించే రోజునుంచి ఈ నెల 25 తేదీ నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వందమీటర్ల దూరం వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఇతరులు ప్రవేశించకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించే సమాచారం అభ్యర్థులకు తెలియజేసి, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రఫి మధ్య చేపట్టాలన్నారు. అభ్యర్థి ఆర్ ఓ గదిలోకి ప్రవేశించగానే కనబడేలా గడియారం ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్ పోలీసు కమిషనర్
అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఇరువైపులా బారికేడ్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నామినేషన్ సమర్పించు అభ్యర్థులు 30 నిమిషాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, చివరి నిమిషం వరకు వేచిచూసే ధోరణి సరికాదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ ఆయుబ్ అలీ, ఏసీపీ దేవేందర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వ నారాయణ, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల షెడ్యూల్, విధి విదానాలు ఇవే..

ఏప్రిల్ 18 – నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
ఏప్రిల్ 25 – నామినేషన్లకు చివరి తేదీ
ఏప్రిల్ 26 – నామినేషన్ల పరిశీలన
ఏప్రిల్ 29 – నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ
మే 13 – పోలింగ్, జూన్ 4 – కౌటింగ్, ఎన్నికల ఫలితాలు
పైన సూచించిన తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోగా నామినేషన్లు అందజేయాల్సి ఉంటుంది.

వరంగల్ లోక్ సభ స్థానం ఎస్సీలకు రిజర్వ్ అయినందున నామినేషన్లు దాఖలు చేయు అభ్యర్థులు సంబంధిత మండల తహశీల్దార్ చే ధృవీకరించిన కుల ద్రువీకరణ పత్రంతోపాటు నామినేషన్ రుసుము రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేయాలని భావించే ఇతర ప్రాంతాలకు చెందిన ఎస్సీ వర్గానికి చెందిన అభ్యర్థులు నామ పత్రాలు దాఖలు చేయాలనుకుంటే సంబంధిత కుల ద్రువీకరణతో పాటు ఓటరు జాబితాలో వారి పేరు ఉండి రిటర్నింగ్ అధికారి/ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిచే ఓటరు సర్టిఫికేషన్ ధృవీకరణ పొందాల్సి ఉంటుంది. నామినేషన్ కు చివరి రోజైన 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఏలాంటి నామినేషన్లు స్వీకరించడం జరగదు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారు.

# నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ లోక్ సభ పరిధిలోని నియోజకవర్గాలకు సమన్వయ కర్తలను నియమిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్, పాలకుర్తికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, స్టేషన్ ఘనపూర్ కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వరంగల్ వెస్ట్ కు మాజీ కుడా చైర్మన్లు మర్రి యాదవ రెడ్డి, ఎస్.సుందర్ రాజ్ యాదవ్, మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, వరంగల్ ఈస్ట్ కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేటకు మాజీ చైర్మన్ కె.వాసుదేవారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సమ్మారావు, భూపాలపల్లికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలను నియమించారు.

# జర్నలిస్ట్ రమేష్ మాతృమూర్తి మృతి



**వరంగల్ వాయిస్, పరకాల:** ప్రెస్ అసోసియేషన్ పరకాల అధ్యక్షులు, నవతెలంగాణ రిపోర్టర్ మోరే రమేష్ బాబు మాతృమూర్తి మోరె ఐలమ్మ (86) సోమవారం సాయంత్రం 6 గంటలకు అనారోగ్యం కారణంతో పరమపదించారు. ఈ సందర్భంగా పలువరు రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు సంతాపం ప్రకటించారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాష్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, సిబ్బంది ప్రఘాడ సానుభూతి తెలిపారు.

# అయోధ్యలో శ్రీ రామ నవమి వేడుకలు

**వరంగల్ వాయిస్, ఉత్తరప్రదేశ్ :** శ్రీరామనవమి వేడుకల సందర్భంగా రామజన్మ భూమి అయోధ్యనగరి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఆయోధ్య రామ మందిరాన్ని 20 గంటల పాటు భక్తుల కోసం తెరచి ఉంచాలని నిర్ణయించారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్ట అనంతరం తొలి శ్రీరామ నవమి కావడంతో అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 40 లక్షల మంది వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీరామ మందిర్ ఆలయ ట్రస్టు ఏడు వరుసల్లో భక్తులను దర్శనానికి అనుమంతించాలని నిర్ణయించింది. శ్రీరామనవమి వేడుకలకు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గంలో రోజు రోజుకు కాంగ్రెస్ పార్టీలో వందల నుంచి వేల సంఖ్యలో వివిధ పార్టీల నుంచి చేరుతున్నారు. మంగళవారం నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు భాషబోయిన ఐలయ్య, బాల్నె రఘుపతి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఇంటి రమణారెడ్డి, ఇంటి రాజిరెడ్డి, పిల్లల రవీందర్ తో పాటు 50మంది బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, వివిధ కుల సంఘాలు, యూత్ నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హనుమకొండ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికలలో పరకాల నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ సాధించే దిశగా కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుడ్ల మనహార్రావు, ధర్మారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గడల రమేష్, పెద్దబోయిన రవీందర్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దుప్పటి కుమారస్వామి, వీరేషం పాలడుగుల జైపాల్, యాదండ్ల ప్రశాంత్, పల్లె నారాయణ గౌడ్, గోల్కొండ కొమరయ్య, పులి సమ్మయ్య, బాషిక రమేష్, బాషిక తిరుపతి, మోటం కోటయ్య, బాషబోయిన కుమారస్వామి, గుండెబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** గ్రేటర్ వరంగల్ ఒకటో డివిజన్ నాగారం గ్రామంలో ఏప్రిల్ 26 శుక్రవారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన నాగారం గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు దామెర రాజు, మాజీ సర్పంచ్ అరుణ్, తాళ్ల నర్సయ్య, కార్యదర్శి కళ్లెబోయిన మల్లయ్య, రావుల సమ్మయ్య, శేఖర్, సృజన్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకారుల మద్దతు కాంగ్రెస్‌కే



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గం శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారు నియోజకవర్గంలో చేసే అభివృద్ధి పనులకు మద్దతుగా ఉంటామని పరకాల పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వంగల కోటేశ్వర చారి, స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి తోగోటి శంకరాచారి, మాజీ అధ్యక్షుడు గుగ్గిళ్ల రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు రంజాన్ అలీ, మునిగంటి విష్ణువర్ధన్ పాల్గొన్నారు

# ఎంపీగా సుధీర్ కుమార్‌ను గెలిపించాలి

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంటు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మారపెల్లి సుధీర్ కుమార్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని వారి నివాసంలో పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్ కుమార్ హాజరుకావడం జరిగింది. సమావేశంలో చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసింది. కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు న్యాయం జరిగింది. నాలుగు నెలల రేవంత్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులు సాగునీరందక, కరెంట్ రాక చుక్కలు చూస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పరకాల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఒక్కసారి దీవించండి మీకు అండగా ఉంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులకు, మహిళలకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలియచేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒకటేనని, బీఆర్ఎస్ పార్టీ కుటుంబసభ్యులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసిన వాళ్లకు ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో నాలుగు నెలలు తిరగకుండానే ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నమ్మి మోసపోయామని ప్రజల్లో మార్పు మొదలైందని తెలిపారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఇలాంటి పరిస్థితుల్లో ఏనాడు లేవన్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా మోడి అడుగులు

### బీజేపీ నేత డాక్టర్ విజయ చందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ బూత్ విజయ సంకల్ప అభియాన్ లో భాగంగా మూడోసారి కేంద్రంలో నరేంద్ర మోడిని ప్రధానమంత్రిగా వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను గెలిపించడానికి దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో 84 పోలింగ్ బూత్ లలో గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హుజురాబాద్ నియోజకవర్గం ప్రభారి డాక్టర్ పెసరు విజయచందర్ ఓటరు మహాశయులను కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు డెంగు నవీన్, అన్నబోయిన రోహిత్ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి వేల్పుల సుధాకర్, కొలనుపాక సుధాకర్, మాదాసి చిరంజీవి, గొడిశాల సాంబరాజు, పిడుగు అనిల్, బత్తుల సుమంత్, బత్తుల విశ్వంత్, రామ్ వినయ్, దండ్రి శివ, తదితరులు పాల్గొన్నారు.

## రేపు వైభవంగా సీతారాముల కల్యాణం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో అతి పురాతనమైన ఆరు శతాబ్దాలు చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించుటకు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు. మంగళవారం సీతారాముల కళ్యాణం కరపత్రికను దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ఆవిష్కరించారు. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు తలంబ్రాలను తీసుకురావడం 11 గంటలకు కంది శ్రీనివాస్ రెడ్డిచే ధార్మిక ఉపన్యాసం, 12 గంటల ఐదు నిమిషాలకు కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. కళ్యాణానంతరం అడ్వకేట్ లెక్కల జలంధర్ రెడ్డి-లక్ష్మి దంపతులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కాబట్టి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించగలరని దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు.

# దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఓటు

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు అవగాహన ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో భాగంగా స్వీప్ 5కే రన్ ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఆర్టీసి బస్టాండ్ వద్ద జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశంలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఓటు శాతం కంటే ఎక్కువగా ఈసారి ఎన్నికల్లో నమోదు కావాలని కోరారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కువినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఓటు హక్కు అని దానిని ప్రజలు గుర్తించాల్సిన అవసరముందన్నారు. కళాశాలలతో పాటు విద్యా సంస్థల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని..తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక కళాకారుల బృందం ఓటు హక్కు వినియోగంపై పాటలు పాడి అవగాహన కల్పించారు. ఈ స్వీప్ 5కె రన్ బస్టాండ్ వద్ద ప్రారంభమై అండర్ బ్రిడ్జ్ , జిల్లా ఆసుపత్రి, నెహ్రూ సెంటర్ ద్వారా తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకొని ముగిసింది. ఈ 5కె రన్ లో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, రెవెన్యూ లెనిన్ వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, డీఎఫ్ఓ బత్తిని విశాల్, ట్రైనీ ఐపీఎస్ పండరి చైతన్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీఓ అలివేలు, స్వీప్ నోడల్ అధికారి జీనుగు మరియన్న, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి బాయి, మునిసిపల్ కమిషనర్ రవీందర్, డీఈఓ రామారావు, పశు సంవర్ధక శాఖ అధికారి సుధాకర్, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్ ,స్థానిక తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎన్.వై.కె కోఆర్డినేటర్ అవినాష్, ఇతర జిల్లా అధికారులు, వైద్యాధికారులు, డీఆర్డీఏ సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మంద కృష్ణ మాదిగను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేవంత్ రెడ్డికి రాజకీయంగా జడ్పీటీసీ నుంచి మొదలుకుంటే ఎంపీ అయ్యేదాకా మాదిగలే అండగా నిలిచారని అలాంటి మాదిగలను రాజకీయంగా ఎదగకుండా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదిగల వ్యతిరేకి అయినా మల్లికార్జున్ ఖర్గేతో కలిసి మాదిగలను అణిచివేస్తున్న రేవంత్ రెడ్డి అని ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ అన్నారు. మంగళవారం హంటర్ రోడ్ వేద కన్వెన్షన్ లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న నారాయణఖేడ్ కాంగ్రెస్ జన జాతర సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణలో మాదిగలలో ఆయనకు ప్రచారం లేనప్పుడు మంద కృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన ప్రతి బహిరంగ సభకు రేవంత్ రెడ్డిని ఒక అతిథిగా పిలిచి రేవంత్ రెడ్డి అందరికీ దగ్గర అయ్యేలాగా రాజకీయంగా ఆయనకు గుర్తింపు తెచ్చిందే మందకృష్ణ మాదిగ అని, అలాంటి మందకృష్ణ మాదిగను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని అన్నారు. ఇంకెప్పుడైనా మంద కృష్ణ మాదిగను విమర్శిస్తే మాదిగల ఆగ్రహానికి రేవంత్ రెడ్డి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా మాదిగలకు క్షమాపణ చెప్పి తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఎంపీ స్థానాలలో వరంగల్, నాగర్ కర్నూల్ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కంటోన్ మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ లో మాదిగల నుంచిఅభ్యర్థిని నిలబెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నాయకులను మాదిగల పల్లెల్లోకి రాకుండా తరిమి కొడతామని హెచ్చరించారు. రాబోయే ఎలక్షన్ లో మాదిగల తిరుగుబాటు ఎలా ఉంటుందో రేవంత్ రెడ్డికి చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎంఎస్పీ వరంగల్ ఇంచార్జి మంద రాజు మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ, కందికట్ల విజయ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ తో కలిసి 200 మందికి పైగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బీజేపీలో చేరారు. వారికి వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి చేస్తున్న సేవలను, పేద బడుగు బలహీన వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఆకర్షితులై అరూరి రమేష్ తో కలిసి పనిచేయాలని బీజేపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ సర్కార్ రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఉచిత హామీలు హామీలకే పరిమితం అయ్యాయని అన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల వైఫల్యాలను గడప గడపకు తీసుకెళ్లి ఓటు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి కాషాయ జెండా ఎగుర వేస్తున్నామని అన్నారు. కాబట్టి, ప్రతి కార్యకర్త పూర్తి సమయం కేటాయించి బీజేపీ విజయంలో పాలు పంచుకోవాలని కోరారు. బీజేపీలో చేరిన వారిలో రాజాన్ బాబు, పెంటం సాంబయ్య, మహామ్మద్ రహిమ్ పాషా, దువ్వ శ్రీధర్, గోనెల అన్నమయ్య, పసుల కిషన్, దోమకోండ కిషన్, మునిగాల కాళిదాస్, మునిగాల బాబు, యాకయ్య, బండి వెంకన్న, గడ్డ సదానందం లతో పాటు 200 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సంతోష్ రెడ్డి, రాజేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, 46వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్, 45వ డివిజన్ అధ్యక్షుడు శివ, నాయకులు దువ్వ సురేష్, వెంకట్‌రావు, మహేందర్, శ్రీకాంత్, కొమురయ్య, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ కుటుంబానికి ఆర్థికసాయం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** గర్భ సంచి క్యాన్సర్ తో బాధపడుతూ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందిన ఆశా వర్కర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమ ఔనత్యాన్ని ఆరోగ్య శాఖ చాటింది. డోర్నకల్ మండలం మల్లాయికుంట గ్రామానికి చెందిన తేజావత్ మంగమ్మ అశ వర్కర్ గా విధులు నిర్వర్తిస్తుంది. గత 2 సంవత్సరాలుగా గర్భసంచి క్యాన్సర్ తో బాధపడుతు ఏప్రిల్ 8న ఖమ్మంలోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పోందుతూ మృతి చెందింది. జరిగిన ఈ విషయంపై విచారం వ్యక్తం చేస్తూ డోర్నకల్ మెడికల్ అండ్ హెల్త్ శాఖ డాక్టర్, సూపర్వైజర్లు, మెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు స్పందించి కలిసి దాదాపు రూ. 40 వేల రూపాయల సమకూర్చారు. మంగళవారం మల్లాయికుంటలో బాధిత కుటుంబ సభ్యులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కళావతి బాయి పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రైవేట్ కళాశాల లెక్చరర్, నవతెలంగాణ రిపోర్టర్ మోరె రమేష్ బాబు మాతృమూర్తి మోరె ఐలమ్మ నిన్నరాత్రి అకాల మరణం చెందగా ఉదయం 9:00 గంటలకు మోరె ఐలమ్మ పార్థివ దేహానికి మడికొండ బ్రదర్స్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఏపీఓ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని పెద్దతూండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఊర చెరువులో ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను మంగళవారం ఏపీవో గిరి హరీష్ పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేస్తే ఒక్క రోజుకు 300 రూపాయలు ఉపాధి కూలీ పొందవచ్చని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలకు మంచి నీళ్లు, చలువ పందిరి, మెడికల్ కిట్ ఏర్పాటు చేశామని, ఎండ తీవ్రత కారణంగా కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రేగ శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీరా సంతోష్, కూలీలు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చిన్ననాటి నుంచే చిరుధాన్యాల ఆహారం అలవాటు చేసినట్లయితే పిల్లల మానసిక ఎదుగుదలతో పాటు, శారీరకంగా దృఢంగా తయారవుతారని, పెద్దలు కూడా తమ ఆహారంలో చిరుధాన్యాలను ఒక భాగంగా చేసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ఎముకలకు సంబంధించిన అనేక సమస్యలు దరిచేరవని ప్రముఖ ఆయుర్వేద వైద్య ప్రావీణులు, వెన్నుముక సమస్యల నిపుణులు పాములపర్తి రామారావు అన్నారు. మంగళవారం ఎర్రగట్టుగుట్ట వద్ద గల తన చికిత్సాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిల్లెట్ హబ్ లాభాపేక్ష లేకుండా ప్రజలలో మిల్లెట్స్ వ్యాప్తికై చేస్తున్న అవగాహన కార్యక్రమాలను అభినందిస్తూ, చిరుధాన్యాల సమాచారంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రత్యేకించి పిల్లల కోసం తయారు చేసిన చిరుధాన్యాల బిస్కెట్స్, స్నాక్స్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిల్లెట్స్ కుకింగ్ ఎక్స్ పర్ట్ కుసుమ కవిత మాట్లాడుతూ చిరుధాన్యాలపై ఉన్న సందేహాలను, వాటిని వాడే, వండే విధానాలకు సంబంధించిన ఉచిత సమాచారాన్ని 91003 73129 నెంబర్లు సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త, మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విరాళాలు అందజేయండి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని తెలిసినా మౌనంగా ఉంటే జరిగే నష్టం చాల ఘోరంగా ఉంటుందని జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్, కాంటెస్టెడ్ కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి బరిగెల శివ అన్నారు. అందుకే ఇప్పుడు తను దేశ ప్రధాని పోటీ చేసే వారణాసిలో పోటీ చేస్తున్నానని తెలిపారు. తప్పకుండా మీ వంతు విరాళంగా రూ.100 దేశం కోసం, రాజ్యాంగం కోసం సహాయం చేయండని ఆయన కోరారు.

## రేపు దత్త పీఠంలో శ్రీరామనవమి వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అవధూత దత్త పీఠాధిపతి, జగద్గురు, పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త పీఠ ఉత్తరాధికారి, పరమహంస, పరివ్రాజకాచార్య వర్యులు శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో వరంగల్ ములుగు రోడ్డులోని శ్రీ వరద దత్త క్షేత్రంలో శ్రీ రామ నవమి కళ్యాణోత్సవాల రేపు నిర్వహిస్తున్నట్లు ఎస్ జీఎస్ దత్త జ్ఞాన బోధ సభ వరంగల్ ట్రస్ట్ తెలిపింది. బుధవారం శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ వరద దత్త క్షేత్రములో ఉదయం 10 గంటల నుంచి శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు. శ్రీ సీతా రాముల కళ్యాణోత్సవంలో అందరూ భక్తులు పాల్గొని శ్రీ స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

## భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. కబ్జాలకు దిగితే ఎవరినైనా వదిలేది లేదని, భూ కబ్జాలకు గురైన బాధితులు తమ పరిధిలోని పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సామాన్యులకు, పేద ప్రజలకు న్యాయం చేయడమే తమ అభిమతమని ఎస్పీ వెల్లడించారు. భూ కబ్జాకు యత్నించిన కౌన్సిలర్ కొత్త హరిబాబును మంగళవారం భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భూపాలపల్లి పరిధిలోని కాసింపల్లికి చెందిన ఓ వ్యక్తికి చెందిన జామాయిల్ తోటను ధ్వంసం చేసి కాపలాదారులపై దాడి చేసి అక్రమంగా జామాయిల్ తోటలో రోడ్లు వేసి పక్కా ప్రణాళికతో బాధితుడి భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తుండగా, బాధితుడి పిర్యాదుతో ఈ ఘటనపై కేసు నమోదు చేసిన భూపాలపల్లి పోలీసులు, మున్సిపల్ కౌన్సిలర్ కొత్త హరిబాబుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

# పాఠశాలల మరమ్మతు పనులను పూర్తి చేయాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, వెంకటాపురం :** జిల్లాలోని పాఠశాలల మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం వెంకటాపురం మండలంలోని జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం పాఠశాలను, యూపీఎస్ వీరభద్రపురం పాఠశాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదనలో 25 శాతం నిధులు ముందస్తుగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని వినియోగించుకొని పనులు రికార్డ్ చేసిన వారం రోజులలో బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేశామని, నిధులకు ఎటువంటి ఇబ్బంది లేనందున పాఠశాల అభివృద్ధి పనులు అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర చిన్న, చిన్న పనులు వెంటనే పూర్తి చేయాలని, వాటికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే తప్పనిసరిగా బాలికల టాయిలెట్లు, బాలుర టాయిలెట్లు, తాగునీటి సరఫరా, తరగతి గదిలో ఉన్న మైనర్ రిపేర్లను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, మరమ్మతు పనులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలలోని మరమ్మతుల పనులన్నీ ఈ నెలలో పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలలో విద్యారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనినా, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంఈఓ వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ రాజేష్ , ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి



**వరంగల్ వాయిస్, ములుగు :** ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు జరుగనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించవద్దని పేర్కొన్నారు. పరీక్ష రాసే వారితో పాటు ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు తీసుకెళ్లకుండా చూడాలన్నారు. నిబంధనలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్ సీకి సంబంధించిన పరీక్ష కేంద్రాలు ములుగు జిల్లా మూడు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మూడు కేంద్రాల్లో 526 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్ కు సంబంధించిన పరీక్ష కేంద్రాలు ములుగు జిల్లా మూడు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 602 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. బస్సుల సౌకర్యం కల్పించాలని, దీంతో పాటు విద్యుత్ కు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎండాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు తీసుకెళ్లే సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా మాత్రం వ్యవహరించవద్దని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి పాణిని, జిల్లా కోర్డినేట్ డీఈఓ పాణిని, ట్రాన్స్ కో డివిజనల్ ఇంజినీర్ పి.నాగేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పి. వెంకటేశ్వర్లు, టీఓఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శంకర్ రావు, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, ఆర్ఎస్ఐ కనకయ్య, డిపో మేనేజర్ శంకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ స్థానాలను అధిక సంఖ్యలో గెలుచుకొని మూడవసారి ప్రధాని మోడీకి కానుక ఇవ్వాలని, వరంగల్ పార్లమెంటు బజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోసం బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. రెండవ రోజు మంగళవారం రేగొండ మండలంలోని రేపాక, రాయల్పల్లి, తిరుమలగిరి గ్రామంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి గౌడ్ , సుంకరి మనోహర్, రేగొండ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార నిర్వహించారు. ఈ ప్రచారంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపురి రాజమౌళి గౌడ్ ఇంటింటి ప్రచారంతో పాటు వీధి వీధినా పాల్గొని మాట్లాడుతూ, దేశంలో మరోసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాబోతుందని సామాన్య ప్రజలు సైతం మోడీని మరోసారి ప్రధాని చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ప్రధాని మోడీ పరిపాలన సామాన్య ప్రజలకు సైతం మేలు చేసే విధంగా ఉన్నాయని, దేశ భద్రతే ముఖ్యంగా యువత ముందుకు వస్తున్నారని, ప్రపంచ దేశాలలోనే భారతదేశాన్ని విశ్వ గురువుగా చేసేటువంటి దమ్మున్న నాయకుడు మోడీ అని అన్నారు. దేశ ప్రధాని మోడీ రెండు పర్యాయాలు విజయవంతంగా దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమ, రైతు సంక్షేమంతో పాటు ప్రజా అభివృద్ధికి సుపరిపాలన అందించిన ఘనత వివరిస్తూ కరపత్రాలను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుంకరి మనోహర్, పెండల రాజు, తూర్పాటి మల్లేష్, దయ్యాల కిరణ్, నీటూరి శ్రీనివాస్, జాలిగాపు నరేందర్, అవుదాపురం శోభన్, సూదమల్ల ప్రశాంత్ , చావటి సంతోష్, దేశ్మీ రాజు, దేశ్మీ సాంబయ్య , ఊకంటి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరూరి రమేష్‌ను గెలిపించండి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** బీజేపీ బూత్ విజయ సంకల్ప అభియాన్ లో భాగంగా మూడోసారి కేంద్రంలో నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను గెలిపించడానికి ఆత్మకూరు మండలం గుడెప్పాడ్, కొత్తగట్టు, మల్కపేట గ్రామాల బూత్ నంబర్ 88, 89, 107, 108 లో ఓటర్లను, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (100రోజుల పని) -కేంద్ర ప్రభుత్వ పథక లబ్ధిదారులను , రైతులను, గ్రామస్తులను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా ఆత్మకూరు మండల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జి పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి బండి శ్రవణ్ కుమార్, గ్రామ బీజేపీ నాయకులు పెండ్యాల సునీల్ రెడ్డి, కందకట్ల దిలీప్, బలభద్ర సాయిరాం, మల్కపేట బూత్ అధ్యక్షులు రజినీకాంత్, నాయకులు వన్నాల రమేశ్, మామిడిపెల్లి పోషాలు, సర్వ్ అశోక్, కొత్తగట్టు బూత్ అధ్యక్షులు కొరుకొప్పుల ప్రశాంత్, నాయకులు సురేష్ పాల్గొన్నారు.

# సఖి సెంటర్ సేవలపై అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో ఏపీఎం రమాదేవి ఆధ్వర్యంలో సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సఖి ముఖ్య ఉద్దేశాలు, అందించిన సేవలను సఖి సెంటర్ కేసు వర్కర్ హరిత, పారామెడికల్ స్టాఫ్ సరిత పాల్గొని వివరించారు. ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కౌన్సిలింగ్, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి న్యాయ సహాయం, ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన ఉండాలని చెప్పడం జరిగింది. సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు తెలుపుతూ గృహ హింస లైంగిక వేధింపులు పనిచేసే చోట వేధింపులు అత్యాచారాలు నుంచి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని వివరించారు. హరిత మాట్లాడుతూ సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తారని, సమస్య ఉన్నప్పుడు 181 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం, రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా 08702452112 అనే నెంబర్ కి కాల్ చేయడం ద్వారా సహాయం బాధిత మహిళలకు సహాయం అందించ బడుతుందని చెప్పడం జరిగింది. అదేవిధంగా లీగల్ కౌన్సిలర్ మాట్లాడుతూ బాధిత మహిళలు కోసం ఏర్పాటు చేసిన సఖి సెంటర్ లో ఐదు రకాల సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు.

# కడియం కావ్యను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హంటర్ రోడ్డు డి- కన్వెన్షన్ హాల్ లో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్ యూఐ ఆధ్వర్యంలో పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, మాజీ నేషనల్ ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు రోహిత్, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు, పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎన్ఎస్ యూఐ విద్యార్థి ఒక సైనికుడిగా కష్టపడి రాబోయే పార్లమెంట్ ఎలక్షన్ లో మన వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ విద్యార్థి నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్‌కు అండగా ఉంటాం

## దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్‌కు అండగా ఉంటామని, వారికి సైతం రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి కల్పించాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్‌కు ఇప్పటి వరకు రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో భోజన, నివాస, శిక్షణ ఇతర వసతులు కల్పించారని, రానున్న రోజుల్లో సైతం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్ కు కల్పిస్తున్న వసతిని తరలించినట్లైతే క్రీడాకారులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. తరలించే ఆలోచన ఉంటే విరమించుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, యువజన, క్రీడల విభాగం అధికారులు స్పందించి అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరారు. క్రీడాకారులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, ఇలా క్రీడాకారులకు అన్యాయం చేసే చర్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు.

# తాగునీటి సరఫరాపై తాత్సర్యం తగదు

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** వచ్చే వారం రోజుల్లో ప్రతి ఇంటికి సరిపోను మంచినీరు అందించాలనీ, ప్రజలనుండి ఫిర్యాదులు అందితే తక్షణమే విధుల నుండి తొలగింపు చర్యలు చేపడుతామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తాగునీటి సరఫరాపై అధికారులకు ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జిల్లాలోని కాటారం, మహాదేవపూర్ మండలాల్లో సంబంధిత అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప కాలనీ సందర్శించి స్వయంగా ఇంటింటికి వెళ్లి మంచినీరు సరఫరాపై గృహిణిలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యుల సంఖ్య, నీటి వినియోగంపై ఆరా తీశారు. కార్యక్రమంలో నీటి సరఫరా సక్రమంగా అందడం లేదని, అరకొర మంచినీటి సరఫరా తో ఇబ్బంది అవుతుందని కొంత మంది ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ స్థానిక తాశీల్దార్ కార్యాలయంలో సంబంధిత ఎంపీడీఓ, ఆర్ డబ్ల్యూఎస్, గ్రిడ్ ఏఈలు, పంచాయతీ సెక్రెటరీలతో కలెక్టర్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లోగా ఇంటింటి సర్వే నిర్వహించి, తాగునీరు సమస్య తలెత్తకుండా మండల కేంద్రంలోని ప్రజలకు సరిపోను నీరు అందించాలని, నీటి సరఫరా సమయంలో ఎవరైనా మోటార్లు బిగించి నీటి వినియోగానికి పాల్పడితే, వారికి నోటీసు జారీ చేసి తగు చర్యలు తీసుకొని మోటర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం మహాదేవపూర్ మండల కేంద్రంలోని దుబ్బ గూడెం, కాలనీ మండలంలోని బొమ్మాపూర్ లోని ఎస్సీ కాలనీ, రాపెల్లి కోట గ్రామాలను సందర్శించి నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. రాపెల్లి కోటలో మంచి నీటి ఎద్దడి లేదని సకాలంలోనే మాకు మంచి నీరు అందుతుందని ఆ గ్రామ గృహిణిలు కలెక్టర్ కు తెలిపారు. కార్యక్రమంలో మహాదేవపూర్ మండల సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈ 3 నెలలు మంచినీటి ఎద్దడి లేకుండా పైపు లైన్ లో ఎక్కడ సమస్య ఉన్న సత్వరమే స్పందించి ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం, మహాదేవపూర్, తహశీల్దార్ లు, ఎంపీడీఓలు, మిషన్ భగీరథ, గ్రిడ్ ఇంజినీర్లు, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదరణ కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాధారపు శివకుమార్



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల, గోపాల్ రెడ్డి నగర్, పోగుల ఆగయ్య నగర్, పోలింగ్ బూత్ లలో ఇంటి ఇంటింటికి తిరుగుతూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వుకు ఓటు ఎందుకు వేయాలో అని వివరిస్తూ డోర్ స్టిక్కర్లు అతికేస్తూ, పాంప్లెంట్ పంచుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలని అధికారంలోకి వచ్చాక కుటుంబ పాలనకే పరిమితమయ్యారని అన్నారు. ఆ విధంగానే మొన్నటి ఎమ్మెల్యే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపించిందన్నారు. రెండు పార్టీల డీఎన్ఏ ఒకటేనని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ఆదరణ కోల్పోయాయని తెలిపారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ రెండు లక్షల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కామగోని రఘుపతి, సొసైటీ డైరెక్టర్ లెంకలపల్లి స్వామి, డివిజన్ నాయకులు కునమల్ల రవి, గణిపాక స్వామి, రాధారపు మల్లికార్జున్, నమతాబాజి రామకృష్ణ, రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట అభివృద్ధి బీజేపీ ఎంపీతో సాధ్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట జిల్లా నుంచి భాజాపా అభ్యర్థిని ఎంపీగా గెలిపించి కేంద్రానికి పంపిస్తే నిరాటకంగా అభివృద్ధి జరుగుతుందని భాజాపా అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. డోర్నకల్ పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు గార్ల డోర్నకల్ మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు తాను మంజూరు చేయించినవే అని గుర్తు చేశారు. ఇంతే కాకుండా పట్టణంలో ముత్యాలమ్మ గుడి ఎదుట మురుగు కుంపలో ఉన్న పాత పోస్ట్ ఆఫీస్ నూతన భవనం నిర్మాణ పనులు చేయాలని పార్లమెంట్ లో తన వాణి వినిపించడంతో కేంద్ర ఆధికారుల బృందం ఇక్కడి వచ్చిన వెనువెంటనే పనులు ప్రారంభించారి గుర్తు చేశారు. డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్డు సెక్షన్‌లో రైల్వే డబుల్ లైన్ నిర్మాణం కోసం రూ.770.12 కోట్లతో కెటాయించిందని, కేంద్ర బడ్జెట్‌లో ఈ మార్గానికి రూ..100 కోట్ల నిధులు విడుదల చేసిందని వివరించారు. గిరిజనుల గురవు దేవుడు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు భాజపా ప్రభుత్వ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజాపా నియోజకవర్గ ఇంచార్జి భూక్య సంగీత, మండలాధ్యక్షుడు గణేష్ నాయక్, పట్టణాధ్యక్షులు దేవ సింగ్, రెహెమాన్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామనవమికి ముస్తాబైన దేవాలయం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేట లోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం జరగబోయే శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం వేడుకలకు ఆలయం ముస్తాబైంది. 161 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఆలయంలో రామకృష్ణ శాస్త్రి ఆనాటి నుంచి నేటి వరకు వారి వంశీయులు వెంకట రామ నరసయ్య శాస్త్రి, అనంత పద్మనాభ శాస్త్రి తనయుడు పీవీ రామ నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతి ఏటా స్వామివారి కల్యాణానికి వేద బ్రాహ్మణ పండితులు వెళితే నరసింహమూర్తి శర్మ, ప్రభాకర శాస్త్రి, భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహిస్తున్నారు. కురుమ కులస్తులు కరసేవకులుగా సేవ చేస్తూ ఉంటారు. వడ్ల కమ్మరి కులస్తులు రథాల షావాల మరమ్మతులు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకట రామ నరసింహ శాస్త్రి, ఉత్సవ కమిటీ సభ్యులు గోలుగోడ్డు అనిల్, వలుపదాసు కృష్ణ, విలాసాగరం శ్రీనివాస్, చిన్న వద్దిరాజ్ ప్రశాంత్, సోమ అనిల్, పాలకుర్తి రవళి సుమన్, బోల్లపల్లి సరిత సుదర్శన్, శంకేసి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డీఆర్ఎంను కలిసిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి నేడు సికింద్రాబాద్ లో రైల్వే డీఆర్ఎంను కలిసి స్థానిక సమస్యలపైన వినతి పత్రం సమర్పించారు. కాజీపేటలో ముఖ్యంగా కాజీపేట బస్టాండ్, రైల్వే కాలనీలో తాగు నీటి కోసం పైప్ లైన్, రైల్వే స్టేషన్ లో చిరు వ్యాపారస్తుల సమస్యలు, ముఖ్యంగా డివిజన్ కాజీపేటలో ఏర్పాటు చెయ్యడానికి కావాల్సిన అన్నీ వసతులు కాజీపేటను డివిజన్ ఏర్పాటు పై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కాజీపేట పట్టణంలో ఎన్నో సంవత్సరాల నుంచి కాజిపేట బస్టాండ్, రైల్వే పరిశ్రమల కోసం, ఎన్నో ఉద్యమాలు జరిగాయి. కాని ఇంతవరకు కాజీపేట ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. అందుకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత విధానాలే అన్నారు. పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ అగ్రికల్చర్ మినీస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలు హనుమకొండ జిల్లాలోని టీఎన్జీవోస్ భవన్ లో జరిగాయి. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా టీఎన్జీవో కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యుడు లక్ష్మీ ప్రసాద్ వ్యవహరించారు. ఎన్నికలలో ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా బి.నటరాజ్, కార్యదర్శిగా ఎన్.సునీత, అసోసియేట్ అధ్యక్షుడిగా ఐజాజ్ అహ్మద్, కోశాధికారిగా ఎస్.కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఉమ్మడి జిల్లా టీఎన్జీవో బాధ్యులు అభినందించారు. తదనంతరం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ అభినందన కార్యక్రమానికి తెలంగాణ అగ్రికల్చర్ మినిస్ట్రీయల్ స్టాఫ్ అసోసియేషన్ కేంద్ర సంఘ కార్యదర్శి, హనుమకొండ జిల్లా కోశాధికారి పనికెల రాజేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, ములుగు అధ్యక్షుడు పోలు రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఎన్నికైన కార్యవర్గం ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం అనునిత్యంకృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, వరంగల్ జిల్లా కార్యదర్శి గాజే వేణుగోపాల్, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి దశరథం, కేంద్ర సంఘ నాయకులు శ్యామ్ సుందర్, మొయిజ్, జిల్లా నాయకులు పుల్లూరు వేణు గోపాల్, సలీం, రామ్ ప్రసాద్,రాజేష్ ఖన్నా, భగవాన్ రెడ్డి, ఉదయ్ భాస్కర్, రాజీవ్, ప్రణయ్, అశోక్, మెహబూబ్, శ్రీనివాస్, శివ, సాయి, సునీల్, చిరంజీవి తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## నాలా అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నయీంనగర్ వంతెన నుంచి ప్రారంభమైన నాలా అభివృద్ధి పనులను వానాకాలం ప్రారంభం నాటికి పూర్తి కావాలని, అందుకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో హనుమకొండ నయీమ్ నగర్ వంతెన నుండి చేపట్టిన నాలా అభివృద్ధి పనులు కొనసాగుతుండగా వాటిపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సాగునీటి పారుదల, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ విజయ్ కుమార్, జిడబ్ల్యూఎంసి ఈఈ రాజయ్య, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల తరవాత అఖండ-2



బాలకృష్ణ బోయపాటి శ్రీనుకాంబినేషన్ కు ఉన్న క్రేజ్ వేరు. వీరిద్దరి కలయికలో వచ్చిన మాస్ మసాలా కంటెంట్ 'సింహ', 'లెజెండ్', 'అఖండ'.. మూడు చిత్రాలు బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. ఆ కాంబోలో సినిమా అంటే బాలయ్య అభిమానులకు పెద్ద పండగే! 'అఖండ' బాలయ్య కెరీర్‌లోనే బిగెస్ట్ హిట్ జాబితాలో చేరింది. ఇప్పుడు వీరిద్దరి నెక్ట్స్ ప్రాజెక్ట్ మీద ఆసక్తి నెలకొంది. ఇప్పటికే 'అఖండ-2' కూడా ఉంటుందని బోయపాటి చెప్పారు. తాజాగా ఈ చిత్రంపై ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం ఎన్నికల హడావిడి నడుస్తోంది. ఇవి పూర్తయ్యాక 'అఖండ2' పై అధికారిక ప్రకటన ఉంటుంది. 'అఖండ'లో పసిబిడ్డ.. ప్రకృతి.. పరమాత్మ.. కాన్సెప్ట్‌లనే చూపించాం. దీని సీక్వెల్‌లోనూ సమాజానికి కావాల్సిన ఓ మంచి విషయం ఉంటుంది. దైవత్వం మనందరిలో ఒక భాగం. దాన్ని తెరపై చూపిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారు' అని అన్నారు. ఈ చిత్రం స్క్రిప్ట్ వర్క్ మొదలైనట్లు బోయపాటి సన్నిహితుల ద్వారా సమాచారం. ప్రస్తుతం బాలకృష్ణ బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చూస్తున్నారు. శరవేగంగా దీని షూటింగ్ జరుగుతోంది. ఇటీవల ఫస్ట్ లుక్ గ్లింప్స్.ను విడుదల చేయగా సూపర్ టాక్ వచ్చింది. బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. మాస్ యాక్షన్ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనిపించనున్నారు.

# దూసుకుపోతున్న మలయాళ భామ

## పలు చిత్రాల్లో ఆఫర్లు




తెలుగులో వరసగా విజయాలు ఈమధ్యకాలంలో సాధించిన నటి ఎవరైనా వున్నారు అంటే ఆమె ఒక్క సంయుక్త మీనన్. అని చెప్పొచ్చు. మలయాళ భామ అయిన ఈమె తెలుగులో 'భీమ్లా నాయక్' తో ఆరంగేట్రం చేసిన దగ్గర నుండి వరసగా విజయాలు సాధించింది సంయుక్త. తరువాత 'బింబిసార' ఇంకో పెద్ద విజయం, ఆ తరువాత ఏకంగా తమిళ స్టార్ ధనుష్ పక్కన 'సర్' సినిమాలో చేసింది. ఇది తెలుగు, తమిళంలో విజయం సాధించింది. దీని తరువాత 'విరూపాక్ష' సినిమాలో చేసి ఆ సినిమాతో ఇంకో పెద్ద విజయం నమోదు చేసుకుంది సంయుక్త. ఇప్పుడు ఇంకో పెద్ద తెలుగు ప్రాజెక్ట్ 'స్వయంభు' చేస్తోంది, ఇందులో నిఖిల్ సిద్దార్థ కథానాయకుడు. ఈ సినిమా కోసమని సంయుక్త గుర్రం స్వారీ కూడా నేర్చుకుంది. 'స్వయంభు' అన్ని భాషల్లో విడుదల చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నారు, ఇదిలా ఉంటే ఇంకో తెలుగు సినిమా శర్వానంద్ పక్కన కూడా ఇంకో ప్రాజెక్ట్ చేస్తోంది. ఇలా మంచి ప్రాజెక్టులతో వరసగా సినిమాలు చేసుకుంటూ వెళుతున్న సంయుక్తకి ఇప్పుడు ఇంకో పెద్ద ఆఫర్ వచ్చిందని సమాచారం. అది దక్షిణాదిలో కాదు, ఏకంగా బాలీవుడ్ నుండి వచ్చిందని సమాచారం. హిందీలో ఓ ఆసక్తికరమైన ప్రాజెక్ట్ కోసం సంయుక్త ని ఎంపిక చేసారని ఒక టాక్ నడుస్తోంది. ఇందులో ఆమె పాత్ర చాలా బాగుంటుంది అని, అందుకనే ఆమెని ముంబై పిలిపించారని, ఆమె ఈ హిందీ సినిమా ఖరారు చేసుకునేందుకు ముంబై వెళ్లిందని తెలుస్తోంది. విమానాశ్రయంలో సంయుక్త వెళుతున్న ఫోటోస్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. కేవలం ఆ హిందీ సినిమా ఖరారు చేసుకునేందుకు ముంబై వెళుతోందని, త్వరలోనే ఆ సినిమా వివరాలు సంయుక్త ప్రకటించ వచ్చని తెలుస్తోంది. ఈ హిందీ సినిమా ఖరారైతే ఇటు దక్షిణాదిలో కొనసాగిస్తున్న విజయపరంపరని ఇప్పుడు అటు హిందీలో కూడా సంయుక్త కొనసాగిస్తుందని చెపుతున్నారు.

## వరుస సినిమాలతో

# విక్రమ్ బిజీ





ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్ల జాబితాలో టాప్‌లో ఉంటాడు విక్రమ్ . ఈ విలక్షణ నటుడు ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే తంగలాన్ ధ్రువ నక్షత్రం సినిమాల్లో నటిస్తున్న విక్రమ్.. ఈ రెండు సినిమాలు సెట్స్‌పై ఉండగానే మరో సినిమాకు కూడా పచ్చజెండా ఊపేశాడని తెలిసిందే. ఈ చిత్రానికి చిన్నా ఫేం ఎస్‌యూ అరుణ్‌కుమార్ అరతాజీజీని 62 దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా ఏప్రిల్ 17న విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా వరుస అప్‌డేట్స్ రెడీ అవుతున్నాయి. తాజా టాక్ ప్రకారం చియాన్ 62కు సంబంధించి ఓ మాస్ ప్రోమో వీడియోను ఇటీవలే షూట్ చేశారట. రేపు ప్రోమో వీడియో/టైటిల్ ప్రకటన ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు తంగలాన్ పోస్టర్‌తోపాటు రిలీజ్ అనౌన్స్‌మెంట్ ఉండబోతుందని తెలుస్తోంది. మరి ఈ క్రేజీ అప్‌డేట్స్ పై క్లారిటీ రావాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే. 62లో కోలీవుడ్ నటి దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు తెలియజేస్తూ రిలీజ్ చేసిన లుక్ ఒకటి ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. చియాన్ 62లో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పా రంజిత్ దర్శకత్వంలో అడ్వెంచరస్ హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న తంగలాన్ గ్లింప్స్‌తోపాటు ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ కలిగించడమే కాకుండా అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. పశు పతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు.విక్రమ్ మరోవైపు గౌతమ్ వాసు దేవ్ మీనన్ డైరెక్షన్‌లో ధ్రువ నక్షత్రం: యుద్ధ కాండం లో నటిస్తున్నాడు. ఈ మూవీలో పెళ్లి చూపులు ఫేం రీతూవర్మ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.



# శివుడి పాత్రధారి అతడేనంటూ ప్రచారం

కథానాయకుడు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రానున్న చిత్రం 'కన్నప్ప'.. స్టార్ ప్లస్‌లో 'మహాభారత' సిరీస్‌ని తెరకెక్కించిన ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఇది రానుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో వివిధ భాషలకి చెందిన పలువురు అగ్ర నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా మరో స్టార్ హీరోను చిత్రబృందం రంగంలోకి దింపింది. అక్షయ్ కుమార్ దీనిలో భాగం కానున్నారని తెలుపుతూ ఓ వీడియో విడుదల చేసింది. సూపర్ స్టార్ అక్షయ్ కుమార్‌ను తెలుగు చిత్ర పరిశ్రమలోకి స్వాగతం పలుకుతున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన భాగం కావడంతో కన్నప్ప మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఇటీవల 'ఓమైగాడ్2'లో అక్షయ్ శివుడిగా కనిపించి మెప్పించిన సంగతి తెలిసిందే. 'కన్నప్ప'లోనూ ఆయన అదే పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొన్నటి వరకు శివుడి పాత్రలో ప్రభాస్ కనిపించనున్నట్లు టాక్ వినిపించింది. ఇప్పుడు అక్షయ్ ఎంట్రీ ఇవ్వడంతో మలుపు తిరిగింది. ఈ చిత్రంలో అగ్ర కథానాయకులు మోహన్ బాబు, మోహన్ లాల్, శివరాజ్‌కుమార్, శరత్ కుమార్ భాగమయ్యారు. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తుండగా.. ప్రభాస్, నయనతారలు కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భరతనాట్యంలో నిష్ణాతురాలైన ప్రీతి కథానాయికగా కనిపించనున్నారు. పోరాట ఘట్టాలతోపాటు, నృత్య నైపుణ్యంతో ప్రేక్షకులకు కనువిందు చేసే పాత్రలో ఆమె కనిపిస్తుందని దర్శకుడు చెప్పారు.





## శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శం: మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎంతటి విషమ పరిస్థితుల్లోనైనా సత్యం, ధర్మానికి కట్టుబడి ఉండాలనే సందేశాన్ని శ్రీరాముని జీవితం మనకు అందిస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని మంత్రి సురేఖ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ఆచరించి చూపిన జీవన ప్రమాణాలు మనకు ప్రతి దశలోనూ స్ఫూర్తినిస్తాయన్నారు. సీతారాముల ఆదర్శ జీవితం భారతీయ కుటుంబ ఔన్నత్యాన్ని చాటుతుందన్నారు. అందుకే యుగాలు మారినా సీతారాములను ఆరాధ్య దైవాలుగా కొలుస్తూ, వారి కల్యాణాన్ని కులమతాలకు అతీతంగా వీక్షిస్తారన్నారు.



# బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

### పేదలకు అండగా కాంగ్రెస్
### వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** దేశంలో భారతీయ జనతా పార్టీ అరాచక పాలన పోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డితో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అన్నారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. దేశంలో సంక్షేమ పాలన రావాలంటే రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ తో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ అరాచక పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఎలాంటి నాయకుడో మీ అందరికి తెలుసన్నారు. అయన భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ దందాలతో ఎంతో మంది పేద ప్రజల కన్నీటికి కారణం అయ్యాడని దుయ్యబట్టారు. అలాంటి నాయకులకు ఓటు వేసి గెలిపిస్తే ఎలాంటి పరిస్థితులు వస్తాయో మిరే ఆలోచించాలన్నారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయాలన్న బీజేపీ కుట్రలను ఎండగట్టాలంటే కాంగ్రెస్ ను గెలిపించాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో లక్ష మెజారిటీ వచ్చే విధంగా ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ముందుండాలన్నారు. మీ ఇంటి ఆడబిడ్డగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చాను. నిండు మనసుతో ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ కులాల పేరుతో, మతాల పేరుతో ఓట్లు దండుకోవాలని నరేంద్ర మోడీ చూస్తున్నాడని ఆరోపించారు. బీజేపీ లాంటి మతత్వ పార్టీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐత ప్రకాష్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే మోలుగురి భిక్షపతి, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారికి లక్ష పుష్పార్చన

చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రులు మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అమ్మవారికి లక్ష చామంతి పూలతో అర్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలి

### ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ఎం) లో అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్స్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షురాలు కొట్టల నిశాంతిని అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన నరసింహ, రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ పద్ధతిన నియమించుకునే సందర్భంలోనే వీరికి రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ఆధారితంగా సెలక్షన్ చేయటం జరిగిందని గుర్తు చేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో స్టాఫ్ నర్సులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. కొన్ని సంవత్సరాలుగా తమ జీవితాలను త్యాగం చేస్తున్నస్టాఫ్ నర్సులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు చట్టం ప్రకారం బేసిక్ వేతనం నెలకు రూ.36,750 చెల్లించాల్సి ఉండగా రూ.29,900 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన వీరికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్ర అధ్యక్షురాలిగా కొట్టల నిశాంతిని..**

ఈ సందర్భంగా నూతన నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర నర్సింగ్ ఆఫీసర్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్ హెచ్ఎం రాష్ట్ర అధ్యక్షురాలిగా కొట్టల నిశాంతిని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నెం మరియా, ఉపాధ్యక్షులుగా కె.చంద్రకాంత్, బి.రత్నకుమారి, సహాయ కార్యదర్శిగా బి.వనిత, ఎస్.కె హిమామ్బి, కోశాధికారిగా ఎస్.సరితలను ఎన్నుకున్నారు.





## పోలీస్ శాఖలో.. ప్రైవేట్ డ్రైవర్ల అత్యుత్సాహం

### అంతా మేమే అంటూ బిల్డప్ - ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పోలీస్ శాఖలో ప్రైవేట్ డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న కొంతమంది తామే ఉన్నతాధికారులమన్న ఊహల్లో తేలిపోతున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ప్రధాన కూడలిలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో పాటు వారు కూడా చేతిలో లాఠీ పట్టుకొని వాహనదారులపై జులుం చూపిస్తున్నారు. పత్రికల్లో రాయలేని బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నైట్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో కూడా షాపులపై, వాహనదారులపై వీరి ప్రతాపం జోరుగానే ఉంది. ఇదేంటని స్థానికులు ప్రశ్నిస్తే ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ హూంకరిస్తున్నారు. ఇక్కడ మేము చెప్పిందే వేదమంటూ తమలోని నిజ స్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నారు. ఇటీవల హసన్ పర్తి–ఎల్లాపూర్ ప్రధాన రహదారిపై ఒక కుటుంబం రాత్రిపూట వాహనంపై వెళుతున్న సమయంలో వాహనాల తనిఖీల్లో భాగంగా అక్కడే ఉన్న ప్రైవేట్ డ్రైవర్ వారిపట్ల అతిగా ప్రవర్తించినట్లు వార్తలొచ్చాయి. మహిళలు ఉన్న విషయాన్ని మరిచి సదరు ప్రైవేట్ డ్రైవర్ నోటికి పని చెప్పడంతో వారు మనస్థాపానికి గురైనట్లు సమాచారం. మరుసటి రోజు ఓ ఎస్సై వాహనం నడుపుతున్న ప్రైవేట్ డ్రైవర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీ డ్రైవర్లపై ప్రతాపం చూపించారు. దీంతో లారీ డ్రైవర్లు అందరూ తిరగబడి ప్రశ్నించడంతో అక్కడి నుంచి పలాయనం చిత్తగించినట్లు నెట్టింట వైరల్ గా మారింది. సదరు ఎస్సై వారిని శాంతింపజేసి గొడవ జరుగకుండా చూసినట్లు ప్రచారం సాగుతోంది. ఫ్రెండ్లీ పోలీసింగ్ నినాదంతో ఉన్నతాధికారులు వ్యవహరిస్తుంటే వారి వాహనాలు నడుపుతున్న ప్రైవేట్ డ్రైవర్లు మాత్రం బిల్డప్ ప్రదర్శించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

## సివిల్స్‌లో మనోళ్లు..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** యూపీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు సత్తా చాటారు. వరంగల్ టౌన్ కు చెందిన జయసింహారెడ్డి ఓవరాల్ గా 103వ ర్యాంక్ సాధించారు. జయసింహారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం అడిషనల్ డైరెక్టర్ ఉమా రెడ్డి కుమారుడు. రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్–లక్ష్మి దంపతుల మూడో కుమారుడు కొయ్యడ ప్రణయ్ కుమార్ 554 ర్యాంక్ సాధించాడు. గత ఏడాది 885 ర్యాంకు సాధించిన ప్రణయ్ కుమార్ ఈ సారి 554 ర్యాంకు సాధించడంతో ఐపీఎస్ కానున్నాడు. అదే విధంగా గీసుకొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ 568వ ర్యాంక్, శివనగర్ కు చెందిన కోట అనిల్ కుమార్ 764వ ర్యాంక్ సాధించి తమ సత్తా చాటారు. యూపీఎస్సీ ఫలితాల్లో తమ సత్తా చాటిన వారికి జిల్లా ప్రజలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com